

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలోని రెడ్డికొట్టాల జడ్పీ హైస్కూల్లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళ జ్యోతిని రెడ్డికొట్టాల గ్రామ సర్పంచ్ గురయ్య, ఆమె కుమారుడు తిరుపతి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నాలుగేళ్లగా పాఠశాల అభివృద్ధికి ఆమె చేసిన కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాకా చంద్రశేఖర్, ఖదీర్ బాష, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దావాదార్, బాష, దేవరాజు, సురేష్, మహేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, సిద్దయ్య, కొండయ్య,శ్రీలత, సావిత్రి, టీచర్లు పాల్గొన్నారు. మండలంలోని రెడ్డి కొట్టాల ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాధిక సేవలు ప్రశంసనీయమని సర్పంచ్‌గురయ్య పేర్కొన్నారు. రాధికను ఆమె సన్మానించారు.

ఉల్లి రైతు కన్నీరు!





రోడ్డుపైన పారబోసిన ఉల్లిని మోటర్ సైకిల్‌పై తీసుకెళుతున్న ప్రజలు

ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని నానుడి. ఉల్లి పంట సాగుకు రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ప్రకృతి ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలిచారు. ఆశల పంటను కాపాడుకోవడానికి అహర్నిశలు శ్రమించారు. దిగుబడి చేతికందే సమయంలో బహిరంగ విఫణిలో ధరలు పతనం కావడంతో రైతుల కంట కన్నీరు ఉబికివస్తోంది. గత ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో విస్తారంగా సాగు చేశారు. పైరు కాలం ముగిసి దిగుబడి చేతికందే సమయంలో ధరలు సగానికి పైగా పడిపోవడంతో నష్టాలపాలయ్యారు.

- కల్లాలు దాటక..కన్నీళ్లు ఆగక
- బహిరంగ విపణిలో ధరల పతనం
- ఉల్లిని రోడ్డుపై పారబోస్తున్న రైతులు
- రైతులకు తప్పని కష్టాలు..
- నిల్వ చేయలేక అవస్థలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు

ప్రజాశక్తి-సింహాద్రిపురం


జిల్లాలో ఉల్లి రైతులకు కన్నీరు పెట్టుకునే పరిస్థితి దాపురించింది. ఉల్లి రైతుకు ఈ ఏడాది కష్టకాలం వచ్చింది. ఒకవైపు అధిక వర్షాలు..మరోవైపు విఫణిలో ధరాఘాతంతో ఉల్లి రైతు కంట కన్నీరు పెడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో కొందరు పొలాల్లోనే గొర్రెలు, మేకలు, పశువులకు వదిలేస్తున్నారు. మరికొందరు ఉచితంగా తెచ్చుకోండంటూ గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. మరి కొందరు పొలం, రోడ్లపై పడవేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాలలో 1500 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. మండలంలోని అహోబిలంకు చెందిన రైతు అంకాలరెడ్డి మూడు ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. ఎకరా ఉల్లి పంటను సాగు చేయడానికి విత్తనాలు, కలుపుతీత ఖర్చులు, ఎరువులు, క్రిమిసంహారక మందులతో పాటు ఇతరత్రా పెట్టుబడులు దాదాపు రూ.1.25 లక్షలు ఖర్చు చేశారు. తీరా పంట చేతికి వచ్చాక ధరల అమాంతంగా తగ్గిపోయాయి. క్వింటాల్ ఉల్లి రూ.వెయ్యి చొప్పున విక్రయాలు జరుగుతుంటే ఐదు ట్రాక్టర్ ట్రాలీలు గడ్డలను కోశారు. వీటిని పీకడానికి, తోకలు కోయడానికి మరో రూ.40 వేల ఖర్చు చేశారు. తీరా ఉల్లి అమ్ముదామనుకున్న సమయంలో క్వింటాల్‌కు వ్యాపారులు రూ.750 అడగడంతో మరో రోజు వేచి చూశారు. మరుసటి రోజు మార్కెట్ మరింత పతనమైందని ఇప్పట్లో కొనుగోలు చేసే పరిస్థితి లేదని వ్యాపారస్తులు చెప్పారు. మరో నాలుగు రోజులపాటు రైతు వేచి చూసిన ఉల్లిని చెప్పుకోవడానికి ఇబ్బందికరంగా ఉన్న ధరలకు వ్యాపారులు అడగడంతో చేసేది లేక పది టన్నులు రోడ్డుపైన పారబోశారు.

ఉల్లిని ఉచితంగా తీసుకెళ్లిన ప్రజలు

మార్కెట్లో ధరలు పతనం కావడంతో వ్యాపారస్తులు ఎవరు కొనుగోలుకు రాకపోవడంతో చేసేది లేక రైతు రోడ్డుపైన పారబోయడంతో ఆరు గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి తీసుకెళ్లారు. రైతు అంకాలరెడ్డి ఉల్లిని రోడ్డుపైన పారపోసిన విషయం తెలియగానే స్థానిక గ్రామస్తులతో పాటు, తెలికి, రావులకొలను, జంగంరెడ్డిపల్లె, సుంకేసుల, ముసల్‌రెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు మోటర్ సైకిల్, ట్రాక్టర్లు వేసుకుని ఉల్లిగడ్డలను తీసుకోవడానికి తండోపతండాలుగా తరలివచ్చారు. బాధిత రైతే స్వయంగా తన సన్నిహితులు, శ్రేయోభిలాషులకు సైతం ఫోన్ ద్వారా ఉల్లిగడ్డలకు ధర లేకపోవడంతో రోడ్డుపైన పోశానని వచ్చి వాటిని ఉచితంగా తీసుకెళ్లాలని తెలియజేశారు. నాలుగు రోజుల క్రితం ఓ రైతు మార్కెట్‌కు ఉల్లిగడ్డలను లారీలు ఎత్తుకెళ్లి అక్కడ విక్రయించితే లారీ బాడుగ సైతం రాదని రోడ్డుపైన పారబోసిన విషయం సోషల్ మీడియాలో వైరలైంది. అలాంటి సంఘటనే మండలంలోని అహోబిలంలో జరగడంతో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ధరల స్థిరీకరణ నిధి ఎక్కడ?

రైతే రాజు, దేశానికి రైతే వెన్నెముక అన్న స్లోగన్లు కనిపిస్తున్నాయే తప్ప వాస్తవంగా ధరలు పడిపోయినపుడు ధరల స్థిరీకరణ నిధి నుంచి ఆదుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వాలు మాత్రం సంక్షేమం పేరుతో ఉచితంగా పథకాలు ఇస్తున్నారు తప్ప రైతులను ఆదుకోవడంలో తీవ్రంగా విఫలమయ్యారని విశ్లేషకులు చెబుతున్నారు. మరో నేపాల్ ఆంధ్రప్రదేశ్ కాకూడదంటే ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రజల సంక్షేమంతో పాటు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి వారి అభ్యున్నతికి దోహదపడాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం ధర లేక ఉల్లి, టమోటాతోపాటు అరటి, చీనీ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడులు సైతం రాక చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణ్యమనే స్థితికి వచ్చారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకుని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పెద్ద ఉల్లిగడ్డలను ఏరుకుంటున్న మహిళలు

ధర లేకనే రోడ్డుపైన పారబోశా

ఉల్లి పంటకు వ్యాపారస్తులు అడుగుతున్న ధరలు కంటే రోడ్డుపైన పోసి ఉచితంగా ప్రజలకు ఇవ్వడం మంచిదని ఆలోచించి రోడ్డుపైన పారబోశా. ఇలాంటి విపత్కర పరిస్థితులు రైతులకు ఎప్పటికీ రాకూడదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిట్టుబాటు ధర లేని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలి.

- అంకలరెడ్డి, బాధిత రైతు, అహోబిలం.

జిఒ రాకపోవడంతోనే కొనుగోలు చేయలేదు

ప్రభుత్వ ప్రకటించిన విధంగా జిఒ రాకపోవడంతో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఉల్లి కొనుగోలు చేయలేదు. జిఒ రాగానే కిలో ఉల్లి రూ.12లతో కొనుగోలు చేస్తాం. అహోబిలంలో రైతు పారబోసిన విషయం మా దృష్టికి వచ్చింది. ఆ రైతును ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటాం.

- మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యానవన శాఖాధికారి, ముద్దనూరు.

'స్త్రీశక్తి'కి పెరిగిన ఆదరణ!

27,03,688 మందికి లబ్ధి - భారం రూ.12.41 కోట్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్రంలోని కూటమి సర్కారు మహిళలకు ఉచిత బస్సు పేరుతో అమలు చేసిన స్త్రీశక్తి పథకానికి జిల్లాలో ఆదరణ లభిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని కూటమి నాయకత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సేవలను కల్పిస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి జిల్లాలో పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ వంటి 470 బస్సుల్లో ఆధార్‌కార్డు కలిగిన మహిళలకు ఉచిత ప్రయాణ సేవలను అందిస్తోంది. స్త్రీశక్తి పథకం అమలుతో సెప్టెంబర్ 15 నాటికి నెల వ్యవధిలో 27,03,688 మంది ప్రయాణించారు. 26,49,070 మంది మహిళలు, యువతులు, 53,898 మంది పిల్లలు ప్రయాణించారు. తొలి 15 రోజుల్లో 13,08,045 మంది మహిళలు, యువతులు, పిల్లలు ప్రయాణించారు. 46.81 శాతం మందికి లబ్ధి చేకూరింది. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 నాటికి అవగాహన పెరగడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య 13,95,643 చేరుకుంది. 53.44 శాతం వెరసి 50.12 శాతం మంది మహిళలు ప్రయాణించారు. 39.97 శాతం ప్రకారం రూ.12,41,90,418 భారాన్ని ప్రజా రవాణా సంస్థ భరించింది.



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ చైర్మన్ నాగరాజు

ఉచిత ప్రయాణంపై మహిళల సంతృప్తి

- ఆర్‌టిసి జోనల్ చైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణం పట్ల మహిళలు సంతృప్తితో ఉన్నారని ఆర్‌టిసి జోనల్ చైర్మన్ నాగరాజు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా మహిళలకు వర్తిస్తున్న ఏకైక పథకం స్త్రీశక్తి పథకమని తెలిపారు. ఇప్పట ివరకు 1.82 మంది మహిళలు ప్రయాణించారని చెప్పారు. నెల రోజుల్లో రూ.82 కోట్లను మహిళల కోసం ప్రభుత్వం భరించిందని పేర్కొన్నారు. రూ.240 కోట్ల ఆదాయంలో రూ.82 కోట్లు ప్రభుత్వం మహిళల ప్రయాణం కోసం భరిస్తూ ఉందని చెప్పారు. జోన్లో 3,236 బస్సులు ఉన్నాయని తెలిపారు. స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి బస్టాండుల నిర్వహణలో అనేక మార్పులు చేశామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ ఉందన్నారు. అనంతపురంలో నిర్వహించిన కూటమి మహాసభ, మహానాడుకు ఆర్టీసీ బస్సుల సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. మహానాడు ద్వారా ఆర్టీసీకి రూ.20 కోట్లు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 15 ఏళ్లు దాటిన బస్సులను నడపడం లేదని తెలిపారు. బస్సుల కొరత ఏర్పడుతుందని చెప్పారు. 600 బస్సులు అవసరం ఉందని, డ్రైవర్లు కండక్టర్ల కొరత ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఇడి చంద్రశేఖర్, ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్‌టిసి జోనల్ వర్క్‌షాప్‌ను చైర్మన్ సందర్శించారు.

ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలు తక్షణమే చెల్లించి ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 33 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.70 కోట్ల నిధులు చెల్లించాల్సి ఉందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందే వారందరూ పేదలేనని, అలాంటి పేదలకు వైద్యం సకాలంలో అందించడంలో ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. వైద్యం సకాలంలో అందకపోతే రోగులు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. ఆస్పత్రుల యాజమాన్యం ప్రతినిధులు చట్టబద్ధంగా సమ్మె నోటీసు ఇచ్చినా సమస్యను పరిష్కరించకపోవడంతో సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తక్షణమే జోక్యం చేసుకుని పెండింగ్లో ఉన్న బకాయిలన్నిటిని చెల్లించాలని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, నాయకుడు నరసింహ పాల్గొన్నారు.

యూరియా రాయితీ మోసపూరితం

ప్రజాశక్తి-కడప అర్బన్

రైతాంగానికి అవసరమైనంత యూరియా సరఫరా చేయకుండా దాని వాడకాన్ని తగ్గించుకుంటే రూ.800 రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఊరించడం ప్రజలను వంచించడమేనని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో యూరియా వాడకం తగ్గిస్తే బస్తాకు రూ.800 రాయితీ ఇస్తామని చెప్పడం రైతులను మభ్యపుచ్చడానికేనని తెలిపారు. కేంద్రం నుంచి రూ.500 కోట్లు తీసుకుని రైతులకు యూరియా వాడకాన్ని తగ్గించు కోమని సుద్దులు చెప్పడం దారుణమని పేర్కొన్నారు. వ్యవసాయాభివృద్ధికి, ఆహార ధాన్యాల ఉత్పత్తికి కీలకమైన ఎరువులను అవసరమైనన్ని సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలిపారు. భవిష్యత్తులో ఎరువులకూ ప్రభుత్వాలు నగదు బదిలీ విధానాన్ని తెచ్చే ప్రమాదంపట్ల అప్రమత్తంగా ఉండాలని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి-కడప అర్బన్

కులవృత్తి గొప్పదనాన్ని, వైభవాన్ని, ప్రభావాన్ని, జీవనాధారాన్ని పెంపొందించడమే సాంకేతికతకు మూలపురుషుడైన విరాట్ విశ్వకర్మ జయంతి ప్రధాన ఉద్దేశ్యమని డిఆర్‌ఒ ఎం.విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో బిసి వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ తొలి వాస్తు శిల్పి, సృష్టికర్తగా ప్రవచనకారులు దేవశిల్పి విశ్వకర్మను ప్రస్తావించడం సమంజసమైనదన్నారు. విరాట్ విశ్వకర్మ, గాయత్రి దేవి చిత్రపటానికి ముఖ్య అతిధులు పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు, బిసి సంక్షేమ శాఖఅధికారులు, పిఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. **జిల్లా పోలీస్ కార్యాలయంలో...** జిల్లా పోలీస్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి కె.ప్రకాష్ బాబు, ఆర్‌ఐలు శివరాముడు, శ్రీశైలరెడ్డి, టైటస్, సోమశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన కడప, అనంతపురం మ్యాచ్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-23 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 537 పరుగులు చేసింది. కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 203 పరుగులు చేసింది. అనంతపురం జట్టు రెండో ఇన్నింగ్స్ లో ఆట ముగిసిన సమయానికి 5.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 26 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. **కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో** చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 454 పరుగులు చేసింది. కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 218 పరుగులు చేసింది. వర్షం కారణంగా చివరి రోజు మ్యాచ్ కు అంతరాయం ఏర్పడడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-కడప అర్బన్

నిరుద్యోగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, ఈ డిఎస్‌సిలో జరిగినన్ని గందరగోళం ఏ డిఎస్‌సిలో జరగలేదని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిఎస్‌సి అభ్యర్థులు అనుమానాలను ప్రభుత్వం, అధికారులు నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఓపెన్లో సెలెక్ట్ అయిన రిజర్వేషన్ అభ్యర్థికి ఓపెన్లో ఇవ్వకుండా రిజర్వేషన్లో పోస్టు ఇచ్చి సామాజిక న్యాయాన్ని నీరుగార్చే కుట్ర జరుగుతోందన్నారు. రిజర్వేషన్లో పోస్ట్ ఇవ్వాల్సిన అభ్యర్థులకు బదులుగా స్పోర్ట్స్, పిహెచ్సి, మాజీ సైనికులకు ఇస్తున్నారన్నారు. డిఎస్‌సి పరీక్షల నిర్వహణ దగ్గర నుంచే గందరగోళం ఉందని తెలిపారు. జిల్లాలకు కులాల వారిగా కటాఫ్ బహిరంగంగా ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. కాల్ లేటర్ ఇచ్చి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి తర్వాత ఎందుకు పోస్ట్ ఇవ్వడం లేదో చెప్పాలని కోరారు. డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేసి వారి గందరగోళానికి ప్రభు త్వం సమాధానం చెప్పాలని లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

సిఐ సుబ్బారావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కడప: సమాజ సేవలో నిరంతరం నిమగ్నమై, శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తున్న సిఐ గంటా సుబ్బారావు సేవలు అభినందనీయమని పాస్టర్ పి.మహేష్, శాంతమ్మ కొనియాడారు. కడప టూ టౌన్‌లో నూతన బాధ్యతలు చేపట్టిన సిఐని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చర్చి సంఘ పెద్దలు పి.రవితేజ, నరసయ్య, రోజా, శాంతిరాజు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

మైదుకూరు పట్టణంలో ఉన్న టివిఎస్‌ఎం స్కూల్ కరస్పాండెంట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకుని స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షు, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి డిమాండ్ చేశారు. బుధవారం డిఇఒ షంషుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ కరస్పాండెంట్ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని తెలిపారు. విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించవలసింది పోయి స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, ఇలాంటి వారి వల్ల విద్యా వ్యవస్థకు నాశనం అవుతుందని చెప్పారు. స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్న. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -బద్వేలు : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం దేవీ నవరాత్రుల పుస్తకాలను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు అమ్మవారు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, అమ్మవారి శాల వీధి అంతయు కలకత్తా పందిరి ఏర్పాటు చేస్తున్నామని, దసరా పది రోజులు ఒక్కో అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని, విజయదశమి రోజు అమ్మవారి వెంట అనగా సాంస్కృతి కార్యక్రమాలతో పాటు రంగురంగుల బాణాసంచా కాల్చబడునని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ వురిమి శ్రీనివాసులు, ట్రెజరర్ భూపాలం నాగరాజారావు, ఉపాధ్యక్షులు చాటకొండు సత్యనారాయణ ప్రసాద్, దర్శి సుబ్బరాజా, యాదాల కృష్ణమూర్తి, జూటూరు నాగరాజా, జాయింట్ సెక్రటరీలు దిండుకుర్తి సుబ్బరాయుడు, బెస్తమల్ల సునీల్ కుమార్, తుమ్మలపెంట వెంకటసుబ్బయ్య, సగల రాధాకృష్ణమూర్తి, గుబ్బ వెంకటేశ్వర్లు, కొండపల్లి సుభాష్ కుమార్ పాల్గొన్నారు.

ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి-బద్వేలు

జిల్లాలో పట్టణంలో ప్రస్తుతం జ్వరాలు ఎక్కువ ఉన్న తరుణంలో ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఇదే అదునుగా చూసుకొని ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన డివైఎఫ్‌ఐ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం విషజ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని, జ్వరాలు బారిన పడిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇటువంటి పరిస్థితిని జిల్లాలోని కొన్ని ప్రయివేటు ఆసుపత్రులు రకరకాల టెస్టుల పేరుతో పరీక్షలు నిర్వహించి చికిత్స కోసం ప్రజల వద్ద నుండి వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ఇదే అదునుగా చూసుకున్న డయాగ్నొస్టిక్ సెంటర్లు కూడా అధిక ఫీజులు టెస్టులకు వసూలు చేస్తున్నారన్నారు. ఆసుపత్రులు యాజ మాన్యాలు డయాగ్నొస్టిక్ సెంటర్లతో టయ్యప్ అయి కమీషన్ తో ప్రజలను పంపిస్తున్నారని అన్నారు. ఆర్ ఎం పి క్లినిక్ నడుపుకునే వారు కూడా అర్హత లేకున్నా సెలైన్ బాటిల్లు ఎక్కిస్తూ ఇంజక్షన్ వేస్తూ డబ్బులు అధికంగా వసూలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మారుతున్నారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికార ఇటువంటి వాటిపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్‌ఐ గా డిమాండ్ చేస్తున్నామని లేకుంటే డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బద్వేల్ డివైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఆదిల్ రూరల్ అధ్యక్షులు ముడుమాల ఓబుల్ రెడ్డి పట్టణ ఉపాధ్యక్షులు యువరాజ్ సహాయ కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఓటర్ల చైతన్యంతో ప్రజాస్వామ్యం ఫరడవిల్లుతుందని, గ్రామాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తాయని యోగి వేమన విశ్వవిద్యాలయానికి జాతీయ సేవా పథకం యూనిట్ పిఒ, ఎంసిఎ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. చింతకొ మ్మదిన్నె మండలంలోని శివాజీ నగర్‌లోని గడప గడపలో ఓటరు చైతన్యం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు వలంటీర్లు వివరిం చారు. ముఖ్యంగా 18 ఏళ్లు పూర్తి చేసుకున్న యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్ ఐడీని పొందాలని తెలిపారు. ఓటర్ ఐడీ కోసం ఆన్లైన్‌లో రిజిస్ట్రేషన్ ఎలా చేయాలో ప్రాక్టికల్ డెమో ద్వారా చూపించారు. ఓటు హక్కు, ప్రజాస్వామ్య హక్కుగా ఎలా పనిచేస్తుందో, ఓటు హక్కు వినియోగించకపోతే ఎదురయ్యే సమస్యలను వివరించారు. సరైన నాయకులను ఎన్నుకోవడంలో ఓటు ఎలా కీలక పాత్ర పోషిస్తుందో, ఫేక్ ఓటింగ్, డబ్బు ప్రభావానికి వ్యతిరేకంగా ప్రజల చైతన్యం ఎలా అవసరమో వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కంప్యూటర్ సైన్స్ ఫ్యాకల్టీ సి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కుల వృత్తిని ఆక్రమిస్తున్న కార్పొరేట్ శక్తులు

ప్రజాశక్తి- బద్వేలు

ఎన్నో సంవత్సరాల నుంచి వస్తున్న మా జీవన వృత్తిని, వేరే కులస్తులు ఆక్రమిస్తున్నారని బద్వేల్ పట్టణ చేతి వృత్తిదారుల సంఘం కన్వీనర్ గంగనపల్లి నాగార్జున అన్నారు. బుధవారం బద్వేల్ నాయీ బ్రాహ్మణులు నేషనల్ మజ్దూర్ యూనియన్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అట్లూరు మండలానికి చెందిన పెత్తందారు ఒకరు రాజస్థాన్ ఇతర రాష్ట్రాల నుంచి వర్కర్లను తీసుకొనివచ్చి కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేసి చిన్న, మధ్య తరగతి నాయీ బ్రాహ్మణుల బార్బర్ షాపులను వ్యాపారం జరగకుండా చేస్తున్నడంపై మా వృత్తికి ఆటంకం కలిగిస్తున్న వారిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పెద్దలపల్లి సుబ్బరాయుడు, సుబ్బరాయుడు, ప్రభలవీటి శ్రీనివాసులు, వెంకటరమణ, మాచుపల్లి రామసుబ్బయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

ప్రజలకు అత్యుత్తమ వైద్యాన్ని అందించడమే ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాన్నాయని డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక పిహెచ్‌సిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం, కేన్సర్ వంటి వాటిపై మహిళలు జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యాధినిరోధక టీకాల ఆవశ్యకతను వివరించడం పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని తల్లి బిడ్డలకు ఇవ్వవలసిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సుప్రీత, స్త్రీ శిశుసంక్షేమశాఖ పర్యవేక్షకులు శ్రీదేవి, లక్ష్మీదేవి, సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-కాశినాయన

బద్వేల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయజ్యోతి నియమించారు. కాశినాయన మండలం అధ్యక్షునిగా కత్తెర గండ్ల పంచాయతీ చెన్నవరం గ్రామానికి చెందిన పుల్లూరు పెద్ద ఖాజావల్లిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు షర్మిల, డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. గోపవరానికి సాంబయ్య, అట్లూరుకు శీలం గంగయ్య, బి.కోడూరుకు గురప్పలను నియమించారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దారుణం

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ దారుణమైన విషయమని వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు పసుపులేటి సాయి దత్త తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కుతీసుకోవాలన్నారు. ఎఐఎస్‌బి జిల్లా కన్వీనర్ రాజేంద్ర, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం


ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని ట్రాయ్ ఎజి మెంబర్ బి.శారద అన్నారు. బుధవారం స్థానిక వెలుగు ఆఫీస్‌లోని కమ్యూనిటీ హాల్‌లో టెలికాం వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు అడిగిన కొన్ని ప్రశ్నలకు సిఐజి శారద సమాధానాలు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, చెన్నూరు విఐబిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ ప్రసాద్, వినియోగదారులు, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, సిసిలు, విఒఎఎస్ పాల్గొన్నారు.

21న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డర్స్ పోటీలు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి న్యామతుల్లా

ప్రజాశక్తి-కడప అర్బన్: మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డర్స్ పోటీలు ఈ నెల 21న వెస్ట్ గోదావరిలోని భీమవరంలో నిర్వహిస్తున్నట్లు బాడీ బిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి న్యామతుల్లా అన్నారు. బుధవారం కెకెఆర్ కార్యాలయంలో బాడీ బిల్డర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతిచోట ఎంపికలు నిర్వహించి ఇక్కడి నుంచి పోటీలకు తీసుకు వెళ్తున్నామని చెప్పారు. సమావేశంలో స్టేట్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కోశాధికారి ఇంతియాజ్ ఖాన్, కడప జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.తారిక్ అలీ, సీనియర్ బాడీ బిల్డర్స్ గతంలో మిస్టర్ రాయలసీమ సింహబలుడు ఫిరోజ్ ఖాన్, సభ్యులు రాజేంద్ర, ముసవీర్ ఖాన్, స్వచ్ఛంద సేవ సంస్థలు ఉమర్, సలీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యామతుల్లా


దసరా ఉత్సవాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్యులు

దసరా ఉత్సవాల పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు శ్రీమరకత వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరక నిర్వహించు దసరా ఉత్సవాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్థానిక అమ్మవారిశాలలో అధ్యక్షులు ఆరవేటి సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ యాదాల రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షులు లింగం పట్టాభిరామయ్య, వీవీ స్వామి, సెక్రెటరీ దేవతి రాము, ఆర్యవైశ్య సంఘు, సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ప్రొటోకాల్ వివాదం

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

మైదుకూరు మున్సిపాలిటీలో ఇటీవల ప్రారంభమైన అభివృద్ధి పనుల శిలాఫలకాలపై పేర్ల నమోదు విషయంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులను, ముఖ్యంగా వార్డు కౌన్సిలర్‌ను విస్మరించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. దీనిపై అప్రమత్తమైన మున్సిపల్ సిబ్బంది వెంటనే స్పందించి ప్రొటోకాల్‌ను అనుసరించి పేర్లను శిలాఫలకాలపై చేర్చడానికి స్టిక్కర్‌లను అతికించారు. ఈ నిర్లక్ష్యం అధికారుల పాత అలవాటునా.. లేక వారి అజాగ్రత్త వల్ల జరిగిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీరం పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి సంప్రదాయ వంటకాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రస్తుత పరిస్థితులలో తీసుకోవలసిన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల రుచికరమైన మాంస, శాఖాహార పదార్థాలతోపాటు స్వీట్స్‌ను ప్రదర్శించారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

రామమునిరెడ్డిని పరామర్శించిన తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డిని బుధవారం పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పరామర్శించారు. ఇటీవల రామమునిరెడ్డి కంటికి చికిత్స చేయించుకొని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఇంటికి తులసిరెడ్డి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, చెన్నకేశవ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాడండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆర్‌టిపిపిలో ఎంపీజె నూతన కమిటీ ఏర్పాటు సందర్భంగా కార్మికుల సమస్యలపై పోరాడాలని కమిటీ సభ్యులకు ఎంపీజె రాష్ట్ర కార్యదర్శి సలీం పిలుపునిచ్చారు. ఆర్‌టిపిపి మహమ్మదీయ మజీద్‌లో బుధవారం ఎంపీజె (మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్) నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ కమిటీ సభ్యులు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేయాలన్నారు. పేదవారికి అండగా ఉంటూ వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. చిన్న ఉద్యోగులు తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని నిరసన తెలుపుతున్నారని, వారికి మద్దతు ఇవ్వాలని సూచించారు. ఎంపీజె రాయలసీమ ఇన్‌ఛార్జి ఎండి అయూబ్ ఖాన్, జిల్లా అధ్యక్షులు జాకీర్ ఉమ్రితో కలిసి నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. అధ్యక్షులుగా జమాల్‌బాషా, ఉపాధ్యక్షులుగా ఖాసిం వలి, హబీబుల్లా, కార్యదర్శిగా బాబా ఫక్రుద్దీన్, సహాయ కార్యదర్శులుగా రఫీక్ అహ్మద్, ఖాదర్ బాషా, కోశాధికారిగా బాబా, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కలమల్ల బాషాను, స్థానిక సభ్యులను ఎన్నుకున్నారు.

సెక్యూరిటీ ఉన్న యాప్‌ను వినియోగించాలి

ప్రజాశక్తి - దువ్వూరు

ఖాతాదారులు తమ అకౌంట్స్‌లో దాచుకున్న డబ్బుకు భద్రత కల్పించే సేఫ్టీ సెక్యూరిటీ ఉన్న యాప్‌లను మాత్రమే ఉపయోగించుకోవడం శ్రేయస్కరంగా ఉంటుందని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ శ్యాం తెలిపారు. బుధవారం స్థానిక శ్రీనివాస జూనియర్ కళాశాలలో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన డిపాజిటర్ అవేర్నెస్ ప్రోగ్రాం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకొని వినియోగిస్తున్న బ్యాంకు లావాదేవీలలో సైబర్ క్రైమ్స్ అధికమయ్యాయని పేర్కొన్నారు. ఇలాంటి నేరాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930 ఫ్రీ టోల్ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. భారతదేశంలోని అన్ని రకాల భాషలలోకి ఈ నెంబర్ అనుమతించబడిందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ దుర్గన్న, హెర్డ్స్ అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్, రాటా కళాబృందం కో-ఆర్డినేటర్ ఉదయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ శ్యాం

ఐడిఎల్ స్కూల్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

- డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులోని ఐడిఎల్ స్కూల్ గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తున్నామని డిఇఒ చెప్పారని, అయితే యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నామని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ తెలిపారు. ఆ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తల్లికివందనం ఎంతమంది పిల్లలు ఉంటే వాళ్లందరికీ రూ.15వేలు ఇస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా అందరి తల్లులకు తల్లికివందనం డబ్బులు పడితే ప్రొద్దుటూరులో ఐడియల్ స్కూల్ నిర్లక్ష్యానికి 650 మంది పిల్లలు తల్లికివందనం పథకానికి దూరమయ్యారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు అనేకమార్లు యాజ మాన్యాన్ని హెచ్చరించినా పట్టిం చుకో లేదన్నారు. ఇందుకుగానూ స్కూల్ గుర్తిం పు రద్దుకు సిఫార్సు చేస్తున్నామని అధి కారులు ప్రకటన చేయడాన్ని డివైఎఫ్ఐగా స్వాగతిస్తూనే ఖండి స్తున్నామన్నారు. స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని, తక్షణమే స్కూల్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని సోమిరెడ్డిపల్లె సచివాలయం వన్‌లో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న గుడిమే యాకోబ్ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న సోమిరెడ్డిపల్లె సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి సోదరుడు, వైసిపి నాయకుడు యత్తపు సుబ్బారెడ్డి అంత్యక్రియలకు ఆర్థికసాయం చేశారు. నగదును యాకోబ్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

వేంపల్లె : స్థానిక వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం శ్రీ ఆంజనేయు స్వామి ఆలయంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న గణపతి మృతి చెందాడు. మెయిన్ బజార్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కాంట్రాక్టు బెసిక్‌గా కొన్నేళ్లుగా గణపతి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం టీ తాగుతూ ఒక్కసారిగా కింద పడిపోయి మృతి చెందినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. దహన సంస్కారం చేయడానికి దేవస్థానం తరుపున మృతుడి బంధువులకు రూ7వేలు నగదును దేవస్థానం పాలక మండలి సభ్యుడిచే అధికారులు అందజేశారు. గణపతి మృతి బాధకరమని పాలక మండలి సభ్యుడు పివి రమణ తెలిపారు.

అకాల వర్షం.. నీట మునిగిన ఉల్లి, వరి పంటలు


కూనవారిపల్లె పొలంలో వర్షానికి నీట మునిగిన ఉల్లి పంట

ప్రజాశక్తి - ఖాజీపేట

కురుస్తోన్న భారీ వర్షాలకు ఉల్లి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం ఉల్లి పంట చేతికొచ్చింది. అసలే ధరలు అంతంత మాత్రంగా ఉన్న తరుణంలో అకాల వర్షాల వల్ల మరింత తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి కూనవారిపల్లె, తుడమలదిన్నె గ్రామాల్లో ఉల్లి పంట నీట మునిగింది. ఉల్లి పంట వర్షానికి తడవడం వల్ల గడ్డలు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉల్లికి ప్రకటించిన గిట్టుబాటు ధర రూ.1200 ఏమాత్రం సరిపోదని, కనీసం క్వింటా రూ.3000 ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉల్లి రైతులు కోరుతున్నారు. ఉల్లి పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. వర్షంతో దెబ్బతిన్న ఉల్లిని పరిశీలించి పెట్టుబడి రాయితీ అందించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

చాపాడు : మండలంలో బుధవారం తెల్లవారుజామున పడిన వర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. మండల పరిధిలో 80.2 మి.మీ వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లో ఎక్కడ చూసినా వర్షపు నీరు నిండుగా ఉంది. గత వారంలో ఎండ తీవ్రత అధికంగా ఉండి ఉక్కపోత కూడా ప్రారంభమైంది. రెండురోజులగా పడుతున్న వర్షానికి వాతావరణం పూర్తిగా చల్లబడింది. పల్లవోలు, గుంత చియ్యపాడు, రాజువారిపేట, అనంతపురం గ్రామాల వద్ద గల వంకలు అధికంగా ప్రవహిస్తున్నాయి. పల్లవోలు, చాపాడు వద్ద వరి పంట నీట మునిగింది. చాపాడు, నక్కలదిన్నె మార్గాన ఉన్న గుండ్ల వంక కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. కుందూ నదిలో కూడా నీరు అధికంగా ప్రవహిస్తుండడంతో కుందూ తీర గ్రామాల్లో తహశీల్దార్ రమాకుమారి సిబ్బందిని అప్రమత్తం చేశారు. నదిలో 10 వేల క్యూసెక్కులకుపైగా నీరు ప్రవహిస్తోంది.


చాపాడు : పల్లవోలు వద్ద నీట మునిగిన వరిపంట


స్టాల్ విశిష్టతను తెలుసుకుంటున్న భూపేష్‌రెడ్డి

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి సూచించారు. మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయన్నారు. సరైన పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అంతకుముందు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అక్కడ ఉన్న అంగన్వాడీ టీచర్స్, కార్యకర్తలు, స్టాల్ ఏర్పాటు చేశారు. స్టాల్‌ను ఉద్దేశించి తల్లిదండ్రులకు, డాక్టర్లకు, భూపేష్‌రెడ్డికి ఐసిడిఎస్ సూపర్వైజర్ జయమ్మ వివరించారు. కార్యక్రమంలో మోరగుడి ముఖ్య నాయకులు, డీలర్ విశ్వనాథరెడ్డి, ధనుంజరెడ్డి, వైద్యులు, బాలల పరిరక్షణ అధికారి మహేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కడప అర్బన్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్టేట్ ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ పెంచలయ్య, రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు నగరంలో యూపీహెచ్‌సి.రాధాకృష్ణ నగర్ స్వస్థ్ నారీ స్వశక్తీ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణులు, మహిళలు, పిల్లలకు స్పెషలిస్ట్ వైద్యులచే పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, వైద్యుల సూచన మేరకు మందుల పంపిణీ చేపట్టారు. పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిపిఎమ్ఓ డాక్టర్ ఎ.శశిభూషణ్‌రెడ్డి, జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ ఎంవి చంద్రారెడ్డి, డిసిహెచ్ఎస్ హిమదేవి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి రమాదేవి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలా ఆంజనేయులు, వైద్యాధికారి డాక్టర్ సుమధుర, డాక్టర్ రమేష్, మున్సిపల్ కార్పొరేషన్ వైద్యాధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు తప్పక చేయించుకోవాలి


వేంపల్లె : ప్రసన సమయంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గర్భిణులు ప్రతి నెల వైద్య పరీక్షలను తప్పక చేయించుకోవాలని డాక్టర్ పృథ్వీకుమార్ రెడ్డి సూచించారు. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలోని సచివాలయ-8 పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పిల్లలకు టీకాలను వేయించాలని కోరారు. పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులతో ప్రాణాంతకమైన వ్యాధులు వ్యాపిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి షేపుల్లా, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా బేగం, ఎంపిహెచ్ఇఒ ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, సిహెచ్ఓ బసయ్య, కళావతి, ప్రియా, ఎఎన్ఎం శివజ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : స్వస్థ్ నారీ సశక్తీ పరివార్ అభియాన్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మండల వైద్యాధికారి శివప్రసాద్‌రెడ్డి, కావ్య మాధురి తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లె, లక్ష్మిపేట విలేజ్ హెల్త్ సెంటర్స్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. శేఖర్ రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్ టి.ప్రసాద్, అంగన్వాడీ సూపర్‌వైజర్ ప్రవీణ, సిహెచ్ఓలు సుమలత, రాజరాజేశ్వరి, కీర్తి, అరుణ, ఏఎన్ ఎంలు కీర్తి దాయిని, వనజ, మెరీనా, అంజనమ్మ చంద్రకళ, సింధు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవసరం మేరకు యూరియా సరఫరా చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

వరి రైతుల అవసరం మేరకు యూరియాను సరఫరా చేయాలని ఎంపిపి టి.లక్షుమయ్య కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎకరాకు 2 బస్తాల ప్రకారం కూడా యూరియా సరఫరా చేయలేని పరిస్థితిలో ప్రభు త్వం ఉందన్నారు. ఏఓ దేవి పద్మలత మాట్లాడుతూ చాపాడు మండల పరిధిలో 16వేల ఎకరాలు వరి సాగు అయిందన్నారు. 1000 మెట్రిక్ టన్నులు మండలానికి సరఫరా అయిందన్నారు. 700 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయాలని సభ్యులు తీర్మానించారు. తెల్లవారుజామున 4గంటలకు రైతులకు మోటర్లకు విద్యుత్ సరఫరా ఇస్తున్నారని సభ్యులు తెలిపారు. దీన్ని 6 గంటలకు మార్చాలన్నారు. మండలానికి ట్రాన్స్ కో ఏఈని నియమించాలన్నారు. మొర్రాయిపల్లె రోడ్డు వద్ద ప్రజలు రోడ్డు దాటుకునేందుకు అవకాశం లేకుండా నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకున్నారని వెంటనే రోడ్డు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో చాలామంది రైతుల పంట కాలువలు దెబ్బతిన్నాయని, వాటిని ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కెసి కెనాల్ ఏఈ గురుమోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు వంటకాలవల వివరాలను తెలియజేస్తే పరిశీలించి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండల అధికారులు సమావేశానికి తప్పకహజరు కావాలని సభ్యులు కోరారు. సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపిడిఓ వీరకిషోర్, ఉప ఎంపిపిలు శుభకరుణమ్మ, బాల నరసింహారెడ్డి, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, సిడిపిఒ ముంతాజ్ బేగం, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


తీర్మానం చేస్తున్న ఎంపిపి, ఉప ఎంపిపి

దువ్వూరు : రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేయాలని ఎంపిపి కానాల జయ చంద్రారెడ్డి ఎఒ అమర్ నాథ్‌రెడ్డికి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ యూరియా సకాలంలో సరఫరా చేయకపోతే రైతులు ఇబ్బంది పడతారని తెలిపారు. ఇందుకు ఎఒ స్పందిస్తూ యూరియా కొరత లేదన్నారు. రైతులందరికీ అందుబాటులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. 56 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామని తెలిపారు. ప్రధానంగా రైతులు పసుపు, వరి, ఉల్లి ప్రధాన పంటలు వేయడం వల్ల యూరియా ఎక్కువ వాడుతున్నారని వివ రించారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ హరికృష్ణ, ఎపిడి సుబ్బారెండ్డి, డిప్యూటీ తహశీల్దార్ వేణుగోపాల్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి

సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

సాంకేతిక విద్య పూర్తి చేసిన యువతకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కందుల ఓబుళరెడ్డి చారిటీస్ ఐటిఐలో 2023-2025 విద్యా సంవత్సరంలో చదివి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా తులసిరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక రంగంలో రాణించిన ప్రతి విద్యార్థికి ఆయా రంగాల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు. సాంకేతిక విద్య పూర్తి చేసిన వారు పరిశ్రమలు కూడా పెట్టుకోవచ్చున్నారు. స్వయం ఉపాధి ద్వారా ఆదాయం పొందవచ్చునని సూచించారు. ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాదరావు మాట్లాడుతూ ఐటిఐలో విద్యార్థులకు వృత్తిపరమైన శిక్షణ ఇస్తారన్నారు. ఇంజినీరింగ్, నాన్-ఇంజినీరింగ్ ట్రేడ్‌లలో నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించడం వల్ల ఐటిఐ కోర్సులు గ్రామీణ విద్యార్థులలో బాగా ప్రాచుర్యం పొందినట్లు వివరించారు. అనంతరం ఆయా ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు తులసిరెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. ఐటిఐ కళాశాల తరపున తులసిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐటిఐ అధ్యాపకులు చంద్రశేఖర్, ఉత్తమారెడ్డి, ప్రభాకర్ నాయుడు, వెంకటరెడ్డి, మార్కయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్యారేజీ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

డిపోలో ట్రాఫిక్, గ్యారేజ్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి ఎంజిసిఓ రెడ్డి, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ రవిబాబు కోరారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయా సమస్యలపై మెమొరాండం డిఎం పివి ప్రవీణ్, అసిస్టెంట్ మెనేజర్ సుబ్బమ్మకు అందజేశారు. అనంతరం గ్యారేజీ ఎఎంఎఫ్ కంబగిరి స్వామితో గ్యారేజీ సమస్యలపై చర్చించారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. చర్చల్లో సిసిఎస్ డెలికేట్ కాంతయ్య, రీజినల్ కమిటీ శ్రీను, గ్యారేజీ కార్యదర్శి ఎస్ఎం వలి, రామచంద్రుడు, సత్యంరెడ్డి, రాయుడు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడుతున్న మెప్మా అధికారి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు పురపాలక సంఘంలో మెప్మా విభాగంలో టెక్నికల్ ఎక్స్‌పర్టుగా విధులు నిర్వహిస్తున్న మహాలక్ష్మి అవినీతికి పాల్పడుతున్నారని వైస్ చైర్మన్ బంగారురెడ్డి, కౌన్సిలర్ గరిసపాటి లక్ష్మీదేవి ఆరోపించారు. పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా మై స్టోన్ అనే యాప్ ద్వారా ఒక గ్రూపును సృష్టించి అవినీతి దందాను కొనసాగిస్తున్నారన్నారు. ఆర్పీలపై ఒత్తిడి తెచ్చి ఈ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఆమె సాగిస్తున్న అవినీతికి స్థానిక శాసనసభ్యుడి కార్యాలయంలో పనిచేస్తున్న స్వామి అనే వ్యక్తి సహకారం అందిస్తున్నారని వారు ఆరోపించారు. పొదుపు సంఘాల ద్వారా తయారయ్యే ఉత్పత్తులను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఊరగాయలు పొడులు, జొన్న పేలాలు, టవళ్లు వంటి ఉత్పత్తులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాదు, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాల్లో మాత్రమే కనిపించే రాపిడో బైక్ వ్యవహారం థాంక్యూ సీఎం పేరుతో ఫేక్ వ్యవహారం ప్రొద్దుటూరులో నిర్వహించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యవహారం కూడా త్వరలో బయటపెడతామన్నారు. మహాలక్ష్మి అవినీతి వ్యవహారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.

పాఠశాల స్థల వివాదం పరిష్కారం

లింగాల : మండలంలోని ఎగువపల్లె ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలో ఉంది. పాఠశాల నూతన భవనం నిర్మాణానికి స్థల సేకరణ చేయగా పాఠశాల సమీపంలోని శివారెడ్డి స్థలం రూ.25వేలకు ఇవ్వడానికి అంగీకర పత్రంపై సంతకం చేశారని ఎంఇఒ రామకృష్ణయ్య తెలిపారు. నూతన భవనం నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామని ఆయన తెలిపారు. పాఠశాల స్థలం కోసం ఉపాధ్యాయురాలు శివశకుంతలమ్మ, గ్రామస్తుల సహకారంతో స్థల సేకరణ చేశారు. ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటం : ఎంపీ

పులివెందుల టౌన్ : సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వారి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఎంపీ కోరారు.

అనాథలకు అండ.. ఎద్దుల పెద్ద శేషమ్మ ఆశ్రమం

ఎర్రగుంట్ల : తిప్పులూరు వద్ద ఉన్న ఎద్దుల పెద్ద శేషమ్మ ఆశ్రమం అనాథలకు అండగా ఉందని సిఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఆశ్రమం ఆరవ వార్షికోత్సవం ఎద్దుల నాగేంద్ర ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీఐ విశ్వనాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషఫణి మాట్లాడుతూ ఎంతోమంది అనాథలు, అభాగ్యులను అక్కున చేర్చుకుని వారి బాగోగులు చూడడం చాలా గొప్ప విషయమన్నారు. వారి బాగోగులను ఆశ్రమం వారు చూస్తున్నారని ప్రశంసించారు. చనిపోయిన అనాథలకు కూడా ఈ ఆశ్రమం వారు అంత్యక్రియలు చేస్తున్నారని తెలిపారు.


గ్రామ సచివాలయ తలుపులు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గ్రామదర్శిని సదస్సును బహిష్కరించిన రైతులు

ప్రజాశక్తి - వేంపల్లె

రెవెన్యూ అధికారులు రామిరెడ్డిపల్లెలో చేపట్టిన గ్రామదర్శిని సదస్సును రైతులు బహిష్కరించారు. బుధవారం మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామం లోని గ్రామ సచివాలయంలో రెవెన్యూ అధికారులు గ్రామదర్శిని సదస్సును ఏర్పాటు చేశారు. గ్రామదర్శిని సదస్సుకు హాజరైన రైతులు తహశీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామ రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపించారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారం చేయని అధికారులు బయటికి వెళ్లిపోవాలని రైతులు ఆందోళన చేశారు. తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బందిని గ్రామ సచివాలయం నుండి రైతులు బయటికి పంపించారు. గ్రామ సచివాలయాలనికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించని తహశీల్దార్, విఆర్‌ఓపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

అందరి సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించేందుకు తన శక్తి వంచన మేరకు కృషి చేస్తానని, ఎవరూ అధైర్య పడవద్దని, పార్టీలకతీతంగా సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పులివెందులలోని టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ప్రజల వినతులను స్వీకరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఏ సమస్యలున్నా తన దృష్టికి తెస్తే వీలైనంత మేరలో పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హై కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగార్జున, నాయకులు, ప్రజలు ఉన్నారు.

బిటెక్ రవికి చలపతి ఘన సన్మానం

వేంపల్లె : పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని జనసేన నేత పోతిరెడ్డి చలపతి ఘనంగా సత్కరించారు. బుధవారం పులివెందులలో ఉన్న ఆయనను పోతిరెడ్డి చలపతి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇడుపులపాయ పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఇడుపులపాయ పంచాయతీలో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలని కోరారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే బాధ్యత కూటమి నేతలు తీసుకోవాలని బిటెక్ కోరారు. కార్యక్రమంలో మారుతి, నాగ మల్లికార్జున, సూర్య నారాయణ, వెంకటేష్, బాబు, శేఖర్, మోహన్, సాయికుమార్, చంద్రమౌళి, యోగి, హరీష్, గురుసాయి, రెడ్డెయ్య పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పులివెందుల జెడ్పిటిసి మా రెడ్డి లత అన్నారు. మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లి గ్రామంలో బుధవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌పై ప్రజల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ పెట్టిందన్నారు. అనంతరం నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన, దోమకాటు వల్ల వచ్చు వ్యాధులు వంటి వాటిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, దోమల నివారణకు చేపట్టిన కార్యక్రమాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, దంత వైద్యరాలు భవ్యశ్రీ, వైద్యాధికారి డాక్టం బాలాజీ సబ్-యూనిట్ అధికారి సిద్దయ్య, ఐసిటిసి కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రావణి

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ప్రజాశక్తి - చక్రాయపేట

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని చక్రాయపేట వైద్యాధికారి వాణి పేర్కొన్నారు. పిల్లల పౌష్టికాహారంపై బుధవారం అవగాహన కల్పించారు. సురభి చక్రాయపేట సూపర్వైజర్‌లు ఎస్ శ్రావణి, పి నాగ సుహాషిణి ఆధ్వర్యంలో సచివాలయం పరిధిలో తల్లులు, బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వాణి మాట్లాడుతూ మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్త హీనత బారిన పడకుండా ఉండేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మాసోత్సవాలను ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. సమతుల్య ఆహారం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మారెళ్లమడక అంగనవాడీ వర్కర్లు శాంతి, పార్వతి, సౌదామిని, జయమ్మ, సావిత్రి, కనకమ్మ పాల్గొన్నారు.

పోషకాల లోపం లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తుందని ప్రాజెక్టు సీడీపీఓ ముంతాజ్ బేగం తెలిపారు. స్థూలకాయ నివారణ, బాల్యదశ సంరక్షణ విద్య, శిశు, చిన్నపిల్లల పోషణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలకు పోషణలోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, ఎంపిడిఓ వీర కిషోర్ , ఉప ఎంపీపీ ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి, శుభకరణమ్మ, సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ, పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

లింగాల : రాష్ట్రీయ 8వ పోషణ మాసం పురస్కరించుకొని బోనాల సచి వాలయంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్యులు సలహాలు పాటించాలని ఆమె సూచించారు. మండల వైద్యాధికారులు గౌతమి, ప్రసన్న కుమార్ చిన్న పిల్లలకు వాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

టెంకాయల విక్రయ వేలం వాయిదా

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఎసి వెంకటసుబ్బయ్య, జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ప్రధాన అర్చకులు కేసరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించాల్సిన వేలం పాట వాయిదా పడినట్లు నిర్వాహకులు తెలిపారు. వేలంపాటలో ముగ్గురు పాల్గొన్నారు. రూ.పది లక్షలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. గతేడాది రూ.80 లక్షలు పలికింది. అక్కడి నుంచి వేలం పాట ప్రారంభించడంతో పాటదారులు ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో వేలం వాయిదా వేస్తున్నట్లు ఎసి ప్రకటించారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటి ఎఎస్ఐ నాగార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, బ్యాంక్ అధికారులు, సూపరింటెండెంట్ సుభాష్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.